మధ్య వయసు మహిళలే టార్గెట్

- మాటలు కలిపి, మభ్యపెట్టి.. మత్తు మందు కలిపి నీళ్లు ఇచ్చి..
- ఆభరణాలు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- ఏడు కేసుల్లో కాజేసిన రూ.17లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మాటలు కలిపి, డబ్బులు చూపి మభ్యపెట్టి తర్వాత మత్తు మందు కలిపిన నీళ్ల తాగించి, బంగారు నగలను కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. దృష్టి మళ్లించి మోసాలు చేస్తున్న ముఠాలోని కీలక సూత్రధారి గుజరాతీ కిషన్(24) నగరానికి వచ్చి తెలుగు నేర్చుకున్నాడని, బాలుడితోపాటు ఢిల్లీకి చెందిన ముఠా సభ్యులతో కలిసి మోసాలకు పాల్పడుతున్నాడని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాదాద్రి డీసీపీ రాజేష్‌చంద్రతో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాధితులు కూడా అత్యాశకు పోవడంతో మోసగాళ్ల పని సులభం అవుతుందని, వీరిని ఏమార్చేందుకు ముఠా సభ్యులు మత్తు మందులు వినియోగిస్తున్నారని తెలిపారు. ముఠాలోని మోసగాళ్లపై ఢిల్లీలో ఇదే తరహా మోసం కేసులున్నాయని, వీరు మధ్య వయసులో ఉన్న మహిళలనే టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. గుజరాత్ అహ్మదాబాద్‌కు చెందిన గుజరాతి కిషన్(24) కొంతకాలం క్రితం నగరానికి వచ్చి, ప్లాస్టిక్ పువ్వుల విక్రయం చేస్తున్నాడు. ఢిల్లీలో పలు నేరాలు చేసిన ఇతడు దృష్టి మళ్లించి చోరీలు చేసేందుకు తెలుగు నేర్చుకున్నాడు. మరో బాలుడు, ఢిల్లీ బేగంపూర్‌కు చెందిన ప్లాస్టిక్ పూల వ్యాపారులు రామ్‌లాల్(42) శ్యాంలాల్(30), కోలి(50), గుల్షన్ అలియాస్ గుల్లు(26), దీపక్(28)లతో ముఠాను తయారు చేశాడు. రూ. 500నోట్లు పైన రెండు కింద రెండు పెట్టి మధ్యలో కాగితాలతో నోట్ల కట్టలను తయారు చేస్తారు. బాలుడి వద్ద నోట్లకట్టలు చూపుతూ మోసాలు చేస్తారు. ఈ ముఠా సభ్యులు నగరంలో అఫ్జల్‌గంజ్, దుండిగల్, ఎస్ఆర్‌నగర్, జీడిమెట్ల, హుస్సేనిఆలం, భువనగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మోసాలు చేసి, మహిళల బంగారు పుస్తెల తాళ్లు కాజేశారు.

ఒంటరిగా ఉన్న మహిళ..

ముఠా సభ్యులు నగరంలో సంచరిస్తూ ఒంటరిగా ఉన్న మధ్య వయసు మహిళను టార్గెట్ చేస్తారు. వారి వద్దకు మైనర్ బాలుడిని పంపుతారు. చేతిలో నోట్ల కట్టలతో ఉన్న కవర్‌ను పట్టుకున్న బాలుడు టార్గెట్ చేసిన మహిళ వద్దకు వెళ్లి తన వద్ద ఉన్న కవర్‌ను కొరియర్ ద్వారా పంపాలని అడ్రస్ అడుగుతాడు. ఇదే సమయంలో అటుగా వచ్చిన ముఠా సభ్యులు మహిళతో మాట కలుపుతారు. బాలుడి వద్ద ఉన్న కవర్‌ను కొద్దిగా చించిన ముఠాలోని సభ్యుడు అందులో డబ్బు ఉన్నట్లు చూపుతాడు. మాటలు కలిపి నోట్ల కవర్‌ను ఆమె వద్ద ఉంచుతారు. నమ్మకం కలిగేందుకు డబ్బులకు బదులుగా పుస్తెలతాడు ఇవ్వాలని చెబుతారు. ఈ సమయంలో మాటల మధ్యలో మహిళకు మత్తు ముందు కలిపిన నీళ్లను మహిళతో తాగిస్తారు. ఆమె మత్తులోకి జారుకున్న వెంటనే నగలు, నగదుతో ఉడాయిస్తారు.


మోసానికి వినియోగించే నోట్ల బండిల్‌తోపాటు స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న సీపీ సుధీర్‌బాబు

పట్టించిన సీసీ ఫుటేజ్..

నగరంలో వరుసగా దృష్టి మళ్లింపు మోసాల కేసులు వెలుగులోకి రావడంతో రాచకొండ పోలీసులు రంగంలోకి దిగారు. ముఠా సభ్యులు జవహర్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, నగరంలో పలు ప్రాంతాల్లో తిరుగుతూ మోసాలు చేస్తున్నారు. సీసీ ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులు ముఠా సభ్యులు జవహర్‌నగర్ నుంచి రాకపోకలు చేస్తున్నట్లు గుర్తించారు. జవహర్‌నగర్‌లో ముఠా సభ్యులు ఉన్న ఇంటిపై దాడిచేసిన పోలీసులు ప్రధాన నిందితుడు గుజరాతి కిషన్‌తోపాటు రామ్‌లాల్, శ్యాంలాల్, కోలితోపాటు బాలుడిని అరెస్ట్ చేశారు. వారి నుంచి ఏడు కేసుల్లో కాజేసిన రూ.17లక్షల విలువైన 7బంగారు పుస్తెల తాళ్లతోపాటు మత్తును కలిగించే ఆల్ఫాజోలం స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న భువనగిరి అధికారులను, సిబ్బందిని సీపీ సుధీర్‌బాబు అభినందించారు.త


రవిగుప్తాకు జ్ఞాపికను అందజేస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా

ఖైదీల్లో పరివర్తనకు జైళ్లశాఖ కృషి అభినందనీయం

- హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా

సైదాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జైళ్లను సంస్కరణ కేంద్రాలుగా మార్చి నేరాలు చేసి జైళ్లకు వచ్చిన ఖైదీలలో పరివర్తన తేవడానికి జైళ్లశాఖ చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా కొనియాడారు. చంచల్‌గూడలో సీకా కార్యాలయ హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న తెలంగాణ జైళ్ల శాఖ రిట్రీట్-2024 ముగింపు వేడుకలకు బుధవారం హాజరయ్యారు. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకొని రావడంతో వారి నుంచి సంపద సృష్టించేందుకు జైళ్ల శాఖ అనుసరిస్తున్న విధానాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా మన జైళ్ల శాఖ చేపట్టిన సంస్కరణలను అధ్యయనం చేసేందుకు వివిధ రాష్ట్రాల జైళ్ల డీజీలు, ఐజీలు వస్తున్నారని అన్నారు. అధికారులు, సిబ్బంది సమష్టి కృషిలోనే జైళ్లశాఖకు మంచిపేరు వచ్చిందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్‌లో జైళ్లశాఖ చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు.

మూసుకుపోయిన రోడ్డు పునరుద్ధరణ


రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి

హయత్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): 19 సంవత్సరాలుగా మూసుకుపోయిన రోడ్డును మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, స్థానిక కాలనీవాసులతో కలిసి బుధవారం పునరుద్ధరించారు. ఆర్టీసీ కాలనీ రోడ్డు నంబర్- 5 నుంచి ఆర్టీసీ సూపర్‌వైజర్ కాలనీ వరకు పాత రోడ్డు ఉండేది. రోడ్డును వాడకపోవడంతో రోడ్డుపైన భారీ చెట్లు మొలిచాయి. దీంతో రోడ్డు పూర్తిగా మూసుకుపోయింది. రోడ్డును తెరిపించాలని కాలనీ వాసులంత కలిసి కార్పొరేటర్‌ను కోరారు. దీంతో ఆయన వచ్చి జేసీబీతో చెట్లను తొలగింపజేశారు. ఒక పక్క జాతీయ రహదారి విస్తరణ ప నులు జరుగుతుండగా సరియైన దారులు లేక వాహన దారులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. మూసుకుపోయిన రోడ్డును పునరుద్ధరించడంతో వా హనదారుల ఇబ్బందులు తప్పాయి. కార్యక్రమంలో నాయకులు సీతారామ శర్మ, గర్రం బాల్‌రెడ్డి, కళ్లెం శంకర్‌రెడ్డి, జిట్ట మహేష్, కొండల్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మణ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, రమణ, ప్రకాష్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

'అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దు'

వనస్థలిపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించవద్దని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి సూచించారు. హయత్‌నగర్ డివిజన్ ఆటోసాయినగర్‌కాలనీలో చేపడుతున్న మంచినీటి పైప్‌లైన్ పనులను బుధవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాసిరకం కాకుండా నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీవాసులు అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగే విధంగా తగు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

వనస్థలిపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నాణ్యతా లోపాలు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎన్జీవోస్ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతా లోపాలు లేకుండా చేపట్టాలన్నారు. కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

'సింగరేణి వాంబేకాలనీలో సమస్యలు పరిష్కరిస్తా'

సైదాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి వాంబే కాలనీ, గుడిసెలలో పెండింగ్ ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జీహెచ్ఎంసీ సర్కిల్-7 డిప్యూటీ కమిషనర్ శైలజ తెలిపారు. విద్యార్థుల రాజకీయపార్టీ(వీఆర్‌హెచ్) వ్యవస్థాపక అధ్యక్షుడు యెచ్చు సునీల్ ఆధ్వర్యంలో బుధవారం సింగరేణి వాంబేకాలనీలో నిర్వహించిన సమావేశానికి డిప్యూటీ కమిషనర్ హాజరయ్యారు. ఈసందర్భంగా బస్తీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ఉన్న పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీఆర్‌హెచ్ నియోజకవర్గ ఇన్‌చార్జి నంద్యాల అనిల్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు భాగవతుల మహేష్, కార్యదర్శి అనిల్ గోగికార్, వినయ్, అఖిల్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు నిహాంత్‌రెడ్డి ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి లాంగ్డి పోటీలకు పెద్దఅంబర్‌పేట్‌లోని రాజశ్రీ విద్యామందిర్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కే. నిహాంత్‌రెడ్డి ఎంపికైనట్లు స్కూల్ కోచ్ నీలేష్ తెలిపారు. రవీస్ బ్రిలియంట్ స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో నిహాంత్‌రెడ్డి చక్కటి ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. దీంతో నిహాంత్‌ను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు తమిళనాడులో జరుగనున్న 14వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో నిహాంత్ పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం నిహాంత్‌రెడ్డిని స్కూల్ చైర్మన్ సిద్దంకి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాదర్‌ఘాట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు నడిచే సిటీ బస్సుల ద్వారా ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు 30వ తేదీ గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ టి.సమత తెలిపారు. సాయంత్రం 4నుంచి 5గంటల వరకు జరగనున్న డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికులు 9959226137 ద్వారా సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈ కోర్టును ప్రారంభించిన హైకోర్టు జస్టిస్ లక్ష్మణ్

రంగారెడ్డి జిల్లాకోర్టులు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం ఈ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులతో పాటు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ, శ్రీనాథ్, ధన్వాడ మధుసూదన్‌రావు, జ్యోతి, మీనాక్షి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థి చదువులకు ఆర్థిక సాయం

ఎల్‌బీనగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అనాథ విద్యార్థి డాక్టర్ కోర్సు చదువులకు ఆర్థికంగా సహాయం చేస్తానని జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ చిత్ర లే ఔట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఉంటూ నీట్ తెలంగాణలో 3994 ర్యాంక్ సాధించిన అనాథ విద్యార్థి దాసరి మహంకాళికి కాలేజీ ఫీజు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారని జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్‌రెడ్డి తెలుసుకున్నారు. ఈ మేరకు బుధవారం విద్యార్థి చదువులకు గాను మొదటి విడతగా నలభై వేల రూపాయల చెక్కును బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి చేతుల మీదుగా రఘువీర్‌రెడ్డి అనాథ విద్యార్థి మహంకాళికి అందజేశారు. కార్యక్రమంలో అనాథ ఆశ్రమం నిర్వాహకులు మార్గం రాజేష్, జగదీశ్ గౌడ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా వర్షాధార వ్యవసాయానిదే కీలకపాత్ర

- ఐసీఏఆర్ న్యూ ఢిల్లీ డైరెక్టర్ డా.హిమాన్షు పాఠక్


అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ఐసీఏఆర్ న్యూ ఢిల్లీ డైరెక్టర్ డా.హిమాన్షు పాఠక్

సంతోష్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వర్షాధార వ్యవసాయం ప్రపంచవ్యాప్తంగా కీలకపాత్ర పోషిస్తున్నదని డా.హిమాన్షు పాఠక్ అన్నారు. సంతోష్‌నగర్‌లోని సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైలాంట్ అగ్రికల్చర్(ఐసీఏఆర్-క్రిడా)లో వర్షాధారిత వ్యవసాయం, స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధికి మార్గాలను నిర్మించడం అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న రెండవ అంతర్జాతీయ సదస్సును బుధవారం డా.హిమాన్షు పాఠక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎగ్జిబిషన్ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ భావితరాల మనుగడ, ప్రకృతి వనరుల రక్షణ అనేవి మనం చేపట్టే చర్యలపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. నేల శాశ్వతంగా నిర్జీవమైతే పునరుద్ధరణ ఎవరితరమూ కాదన్నారు. వర్షాధార వ్యవసాయం ఉత్పాదకతను పెంపొందించడానికి, వర్షాధార వ్యవసాయానికి స్థితిస్థాపకతను తీసుకువచ్చినందుకు పరిశోధకులను అభినందించారు. డా. ఎస్.కె చౌదరి డి.డి.జి(ఎన్ఆర్ఎం) మాట్లాడుతూ వర్షాధార వ్యవసాయంలో ఎదురవుతున్న వివిధ ఒత్తిళ్ల సమస్యలను అధిగమించడంలో రైతు సమాజానికి సహాయ పడే సాంకేతికతలు, సి ఫార్సులు, విధాన క్లుప్తాలను తీసుకురావాలని ఆయన ప్రతినిధులను కోరారు. ఐసీఏఆర్ క్రిడా డైరెక్టర్ డా. వీకేసింగ్ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థకు వర్షాధార వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ న్యూఢిల్లీ డీడీజీ డా. ఎస్ కె చౌదరి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డా. జె.వి.ఎన్.ఎస్ ప్రసాద్, ఐఎస్‌డీఏ కోశాధికారి డాక్టర్ పంకజ్, పలు రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, అగ్రి కంపెనీ ప్రతినిధులు సుమారు 750మంది హాజరయ్యారు.

రోడ్డుపై బాధ్యతగా వాహనాలు నడపాలి : సీపీ

- డ్రైవర్లకు, విద్యార్థులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన


రోడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమంలో సీపీ సుధీర్‌బాబు తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): బస్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు బాధ్యతగా వాహనాలు నడపాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు కోరారు. ఏసీఈ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బుధవారం రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు సేఫ్టీ మంత్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్డు నిబంధనలు పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు సేఫ్టీపై అవగాహన పెంచుకోవడంతోపాటు విద్యార్థులు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులతో కలిసి పనిచేయాలన్నారు. వాహనం నడిపే సమయంలో, రోడ్డుపై నడుస్తున్న సమయంలో నిబంధనలు పాటించి అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ డీసీపీ కె మనోహర్, ట్రాఫిక్ డీసీపీలు ఎస్ మల్లారెడ్డి, వి శ్రీనివాసులు, ఆర్‌కేఎస్‌సీ చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి ముత్యాల, రోడ్ సేఫ్టీ కోఆర్డినేటర్ ఆర్ రాజేష్, జగన్, సత్యనారాయణతోపాటు ఏసీఈ ఇంజనీరింగ్, విజ్ఞాన్ మహిళా కళాశాల, సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతోపాటు కాలేజ్ బస్సు డ్రైవర్లు, శ్రీనివాస టూర్స్‌కు చెందిన బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై దృష్టిపెట్టాలి

కొత్తపేట : చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై దృష్టిపెట్టాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్సులోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కు లెక్చర్ హాల్‌లో మన్సూరాబాద్ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతపై విద్యార్థులు వ్యాసాలు రాశారు. ఎస్ఐ నర్సింహారావు, హెచ్‌జీ రవి, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

హయత్‌నగర్ : హయత్‌నగర్ ఆర్టీసీ డిపో- 1, 2 ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని డిపోలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుచరితలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు సమయస్ఫూర్తితో బస్సులను నడిపి మార్గదర్శకులుగా మారాలని కోరారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సహాయ రీజినల్ మేనేజర్లు బాబునాయక్, జగన్, సుచరిత, ట్రాఫిక్ ఏసీపీ శ్రీశైలం, లాఅండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాస్, సహాయ మేనేజర్లు విజయకుమారి, రమాదేవి, సత్తయ్య, నరేష్ పాల్గొన్నారు.

ఇకపై ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై పోరాటం

- స్థానిక సంస్థల్లో విలీనం చేసి నిధులు కేటాయించాల్సిందే
- బడంగ్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ డిమాండ్


విలేకరులతో మాట్లాడుతున్న ఇబ్రాం శేఖర్

సరూర్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల అభివృద్ధి పనులతో పాటు ఆలయాలకు సైతం స్థానిక సంస్థల నుంచి నిధులు కేటాయిస్తున్నప్పుడు విద్యాలయాలకు ఎందుకు కేటాయించడం లేదని బడంగ్‌పేట్ తాజా మాజీ డిప్యూటీ మేయర్, బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇబ్రాం శేఖర్ ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలను కూడా స్థానిక సంస్థల్లో విలీనం చేసి నిధులు కేటాయిస్తేనే అవి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందగలుగుతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలతో పాటు గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఆయా స్థానిక సంస్థల నుంచి నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి బీఎస్పీ ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు స్పష్టం చేశారు. వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీరు, శ్మశానవాటికలు, రోడ్లు తదితర అభివృద్ధి పనులతో పాటు దేవాలయాల అభివృద్ధికి సైతం నిధులు కేటాయిస్తున్నారని, కానీ ప్రభుత్వ పాఠశాలల విషయంలో మాత్రం నిబంధనల పేరు చెప్పి తప్పించుకుంటున్నారని ఆయన విమర్శించారు. పేద, మధ్య తరగతికి చెందిన బహుజనులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు ఎందుకని ఆయన ప్రశ్నించారు. తాను సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచి నేటి వరకు ప్రతి సమావేశంలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నానని, కానీ ఏ ఒక్కరూ తనకు సహకరించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేటర్‌గా తనకు వచ్చిన గౌరవ వేతనాన్ని సైతం విద్యా వలంటీర్లు, స్వీపర్ల వేతనాలకే అందజేసినట్టు ఆయన చెప్పారు. ఇకపై బీఎస్పీ ఆధ్వర్యంలో పాఠశాలల అంశంపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతానని శేఖర్ పేర్కొన్నారు.

బాలాపూర్‌కు రుణపడి ఉంటా..

తనకు సర్పంచ్‌గా, కౌన్సిలర్‌గా, డిప్యూటీ మేయర్‌గా అవకాశం కల్పించిన తన సొంత గ్రామమైన బాలాపూర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని శేఖర్ తెలిపారు. తాను ఆయా పదవులు పొందడానికి అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లే కారణమని, తాను బతికున్నంత కాలం అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తానని ఆయన చెప్పారు. బీఎస్పీ తరపున గెలిచిన తనకు డిప్యూటీ మేయర్ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే సబితారెడ్డికి, తనకు అన్నివిధాలుగా సహకరించిన మేయర్ పారిజాతానర్సింహారెడ్డికి, పాలకవర్గంలోని సభ్యులందరికీ, అధికారులకు తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని పేర్కొన్నారు.

మద్యం బెల్టు షాపులపై సైతం పోరాటం..

గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తున్న మద్యం బెల్టుషాపులు ఎత్తేసే దాకా బీఎస్పీ తరపున పోరాటం చేస్తానని ఇబ్రాం శేఖర్ స్పష్టం చేశారు. పేద, బడుగు వర్గాల ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా దెబ్బతీస్తున్న బెల్టుషాపులు ఎత్తేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. బీఎస్పీ నిరంతరం పేదల తరపున పోరాటాలు చేస్తుందని చెప్పారు.

నిలకడగా డాక్టర్ ఆరోగ్యం

- పోలీసులపై ఆరోపణలు అవాస్తవం
- ఇప్పటికే ఆరు కేసులు నమోదు.. ఏడు సార్లు కౌన్సెలింగ్


డాక్టర్ ప్రణీత, సికిందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు భరించడం కంటే.. చావడమే మేలంటూ సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన డాక్టర్ ప్రణీతరెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సరూర్‌నగర్ పోలీసులు వెల్లడించారు. ఆత్మహత్యాయత్నం ఘటనలో ఇరువైపుల వారిపై పరస్పర కేసులు నమోదు చేశారు. ప్రణీతరెడ్డి అత్తమామలు వెంకట్‌రెడ్డి, స్వరూపలు మంగళవారం ప్రణీతరెడ్డి ఉంటున్న గదిలోకి వెళ్లి బెదిరించారనే ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేశారు. ప్రణీతరెడ్డి ఆత్మహత్యాయత్నం విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు అత్తింటి వద్ద ఆందోళన చేసిన విషయం విదితమే. అయితే కోడలు బంధవులు తమ ఇంటిపై దాడి చేసి తమను చితకబాదారని వెంకట్‌రెడ్డి, స్వరూప దంపతుల ఫిర్యాదు మేరకు జగన్మోహన్‌రెడ్డితో సహా ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

పోలీసులపై బురద జల్లడం సరికాదు..

ఇదిలా ఉండగా ఇప్పటికే సరూర్‌నగర్ పోలీసులకు తమ అత్తింటి వేధింపులపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని డాక్టర్ ప్రణీతరెడ్డి ఆరోపించిన విషయం విదితమే. అయితే ప్రణీతరెడ్డితో పాటు ఆమె బంధువులు పోలీసులపై చేస్తున్న ఆరోపణలు నిజం కాదని సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి ఖండించారు. డాక్టర్ ప్రణీతరెడ్డి పలుమార్లు తమను సంప్రదించి ఫిర్యాదులు చేయగా.. ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రణీతరెడ్డి అత్తమామలతో పాటు వారింట్లో ఉంటున్న కిరాయిదారులపై కూడా ప్రణీతరెడ్డి ఫిర్యాదు చేస్తే, కేసులు నమోదు చేశామన్నారు. అంతేగాకుండా ప్రణీతరెడ్డితో పాటు ఆమె తల్లిదండ్రులను, అత్తింటి వారిని పిలిపించి ఏడు సార్లు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు వివరించారు. విడాకులు, మెయింటనెన్స్ కేసులు కొనసాగుతున్న నేపథ్యంలో ఇంకో చోట నివాసం ఉంటే గొడవలు అయ్యే అవకాశాలున్నాయని మాత్రమే ప్రణీతతో తాను చెప్పడం జరిగిందన్నారు. అంతేగాని అత్తింటి నుంచి వెళ్లిపోమని చెప్పలేదన్నారు. ఈ కేసులో తమకు ఎలాంటి ఒత్తిళ్లు లేవని, చట్టప్రకారం కేసు దర్యాప్తు జరుగుతుందన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ

మాదిగ ఉపకులాలకు అండగా ఉంటూ వారికి ఏ కష్టం వచ్చినా తోడ్పాటు అందిస్తా

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

వనస్థలిపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉపకులాలకు అండగా ఉంటూ.. వారికి ఏ కష్టం వచ్చినా తోడ్పాటును అందిస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. బుధవారం ఎల్బీనగర్‌లోని సితార హోటల్‌లో ఎస్సీ వర్గీకరణపై మాదిగ ఉపకులాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్షడప్పులు.. వెయ్యి గొంతుకలు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వంద ఏళ్ల క్రితం బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగానే జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు ఏర్పడ్డాయన్నారు. మాదిగ కులంలోని 57 కులాలు కలిస్తేనే 15శాతం రిజర్వేషన్ అమలు అవుతుందన్నారు. ప్రతి రెండు కులాల మధ్య సమానత్వం లేకపోవడమే వెనకబాటుకు కారణమని, ప్రతి ఒక్కరికి ఆశయం గొప్పగా ఉండాలని, అత్యాశ ఉండవద్దని హితువు పలికారు. అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు ఒకే విధంగా లేవని, రిజర్వేషన్ల మూలంగా మాదిగలు నష్టపోయి, మాలలు లాభపడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేటి తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ 59 ఉపకులాల్లో మాలలే ఎక్కువగా బాగుపడ్డారని తెలిపారు. ఆనాడే మాలలకు ఎస్సీ షెడ్యూల కులాల నుంచి తొలగించాలని ప్రతిపాదనలు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా రామ్ చందర్‌రాజ్ కమిషన్ రిపోర్ట్ తెలిపిన విధం గా 6శాతం ఉన్న మాలలు 15శాతం రిజర్వేషన్ పొందారని, 9శాతం ఉన్న మాదిగలు 6శాతం రిజర్వేషన్లు పొందారని, ఇదే విషయం ఉషా మెహరా కమిషన్ చెప్పిందని ఇది నిజం కాదా అన్నారు. ఎస్సీ వర్గీకరణను మీరు(మాలలు) కోరుకుంటున్నారా లేదా ప్రశ్నించారు. మాలలతో మాదిగలను పోల్చితే ఇతర ఉపకులాలకు తాను అండగా ఉండలేమని ఆయన తేల్చిచెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ, ఇతర ఉప కులాల అధ్యక్షులు తూర్పాటి హన్మంతు, చింతల రాజలింగం, రాజమౌళి, నర్సింహ, గౌరిశంకర్, ప్రొ.ఈశ్వర్, మంగేష్, కృష్ణ, సాలమ్మ పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాలను పట్టించుకోని ప్రభుత్వం

- బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నాయకుల ధ్వజం
- కందుకూరు గురుకులాన్ని సందర్శించిన నేతలు

సరూర్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకునే గురుకులాల నిర్వహణను గాలికొదిలేసిందని, దాంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు ఆరోపించారు. ఇటీవల ఫుడ్ పాయిజన్ సంఘటన చోటు చేసుకున్న బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని కందుకూరు గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలను బుధవారం బీఆర్ఎస్ నేతలు మర్రి నర్సింహారెడ్డి, యెల్బాల సుదర్శన్‌రెడ్డి, కోటగిరి జంగయ్య, దండు యాదయ్య, బీజేపీ నాయకులు రామిడి వీరకర్ణారెడ్డి, ఆర్.రామకృష్ణారెడ్డి, శూరకర్ణారెడ్డి, ప్రవీణ్‌కుమార్, శివరాంరెడ్డి బీఎస్పీ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు బహుగుణనాయక్ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి పరిసరాలను, బాత్‌రూమ్‌లను, వంట గది, విద్యార్థుల గదులు పరిశీలించారు. అవన్నీ అధ్వానంగా ఉండడాన్ని గమనించి ప్రిన్సిపాల్ దానమయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 500మంది పిల్లలు చదువుకునే గురుకుల విద్యాలయం ఉండేది ఇలాగేనా? అని ఆయనను నిలదీశారు. తాగునీటి నల్లాల వద్ద ఉన్న అపరిశుభ్రతను చూసి మండిపడ్డారు. బియ్యం సైతం నాణ్యతగా లేదని, ఇతర వంట సరకులు సైతం పాడై ఉన్నాయని వారు ఆరోపించారు. బియ్యం సంచులపై ఎలుకలు, పంది కొక్కులు తిరుగుతూ మల విసర్జన చేస్తున్నాయని, ఆ బియ్యంతోనే అన్నం వండుతున్నారని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. నాదర్‌గుల్‌లోని గురుకుల విద్యాలయంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

క్రికెట్ అండర్-17 జాతీయ జట్టులో ఆశ్రితకు చోటు

సరూర్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలోని అండర్-17 బాలికల విభాగం నేషనల్ క్రికెట్ జట్టులో బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్‌కు చెందిన అక్కి ఆశ్రిత చోటు దక్కించుకుంది. జిల్లెలగూడలోని లార్డ్స్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆశ్రిత చిన్నప్పటి నుంచి పట్టుదలతో క్రికెట్ నేర్చుకుని అనేక పోటీల్లో తన ప్రతిభను చాటుకుంది. ఈ క్రమంలో ఆమె ఎస్‌జీఎఫ్ జాతీయ జట్టుకు ఎంపిక కావడం పట్ల స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా బుధవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లార్డ్స్ విద్య సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప ఆశ్రితను శాలువాతో సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్ కేవలం పురుషులకే సొంతం కాదని, మహిళలు సైతం అందులో రాణించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఆశ్రిత అంచెలంచెలుగా ఎదుగుతూ భవిష్యత్‌లో భారత జట్టులో చోటు సంపాదించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆశ్రిత తండ్రి అక్కి ఈశ్వర్‌గౌడ్, లార్డ్స్ విద్య సంస్థల వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీశ్‌కుమార్, ప్రిన్సిపాల్ మరియన్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల బస్సును ఢీకొట్టిన డీసీఎం

అబ్దుల్లాపూర్‌మెట్ : నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ చౌరస్తా సమీపంలోని మయూరీ కాంట వద్ద బుధవారం విజయవాడ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సును పక్క నుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కళాశాల బస్సులో ఉన్న ఫ్యాకల్టీతో పాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం వారిని కళాశాలకు పంపించారు. ప్రమాద విషయం తెలుసుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.